


'వెలుగు'సంఘం నూతన కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి -సూళ్లూరుపేట

సూళ్లూరుపేట సిఐటియు కార్యాలయములో మంగళవారం దొరవారి సత్రం మండలం వెలుగు కార్మికుల నూతన కమిటీ సిఐటియు అనుబంధంగా ఏర్పాటయ్యింది. అధ్యక్షులుగా యం.రమణమ్మ, ఉపాధ్యక్షులుగా పి.దయామణి, ప్రధాన కార్యదర్శిగా బి.యమ్. సంపూర్ణమ్మ, కోశాధికారిగా హిందూశ్రీ, కార్యదర్శులుగా ఏ.స్వాతి,డి. నాగేశ్వరమ్మ, పి.సుజాత ఎంపికయ్యారు. సిఐటియు కార్యదర్శి అక్కయ్య, నాయకులు సుంకర. అల్లెయ్య, బి.పద్మనాభయ్య, చంద్రశేఖర్, మునెయ్య, లక్ష్మి పాల్గొన్నారు. వెలుగు కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రోడ్డుపైనే వంట చేస్తాం..!



వెంకటగిరిలో...



పిచ్చాటూరులో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణీశ్రీ



తిరుపతిలో వంటావార్పు చేస్తూ...

తాడోపేడో తేల్చుకుంటాం..!!

ప్రజాశక్తి - యంత్రాంగం

'ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం.. ఏళ్ల తరబడి నిరీక్షించాం.. పెంచిన నిత్యావసర ధరలతో బతకలేం.. మేమేమీ కొత్తగా ఏవీ అడగడం లేదు.. సిఎం జగన్ ఇచ్చిన హామీనే నెరవేర్చమంటున్నాం..' అంటూ ఎనిమిదో రోజూ అంగన్‌వాడీల సమ్మె అదే ఉద్వేగంతో కొనసాగింది.. ప్రతి శిబిరం వద్ద వారే స్వచ్ఛందంగా డబ్బులు వేసుకుని వంటావార్పు చేసి అందరూ కలసి భోంచేశారు. సమ్మె శిబిరాలన్నీ కిటకిటలాడాయి.. ఐక్యంగా సమ్మె కొనసాగించి, వేతనం పెంచుకునే ఇళ్లకు వెళతాం అని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు.

అప్పులు చేసి బతకలేం : వాణీశ్రీ

పిచ్చాటూరు : ప్రభుత్వం తమ డిమాండ్లన్నీ పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతుందని యూనియన్ జిల్లా కార్యదర్శి వాణీశ్రీ స్పష్టం చేశారు. చాలీచాలని వేతనాలతో ఎన్నాళ్లని బతుకు జీవనం సాగిస్తామని ప్రశ్నించారు. ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తే, వచ్చే ఎన్నికల్లో అంగన్‌వాడీల సత్తా చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు ప్రసాద్, నాయకులు నాగరాజు, రామచంద్రారెడ్డి, అంగన్‌వాడీలు శ్రీవాణి, పూర్ణమ్మకల్యాణి, కృష్ణవేణి, శ్రీదేవి, భారతి, దేవి నాయకత్వం వహించారు.

- సత్యవేడు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎదుట సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ నాయకత్వంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బందితో తెరవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. నాయకులు నిర్మల, శాంతి, ఇందిర, ఝాన్సీ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.
- నాయుడుపేటలో ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ నేతృత్వంలో వంటావార్పు చేపట్టారు. సిఐటియు నాయకులు శివకవి ముకుందా, మునిరాజ, మహేష్, విజయమ్మ, సుకుమారి పాల్గొన్నారు.
- గూడూరు టౌన్‌లో వినూత్నంగా వంటావార్పు చేపట్టారు. తల్లులు వారి చంటి పిల్లలను ఎత్తుకుని సమ్మె శిబిరం వద్దకుచేరుకుని వంటావార్పుకు శ్రీకారం చుట్టారు. జెవికెస్ నాయకులు సంక్రాంతి వెంకటయ్య, సత్యసాయి జిల్లా నుంచి ఎస్.నాగరాజులు 30 మంది కళాకారులు శిబిరం వద్దకు చేరుకుని మద్దతు ప్రకటించారు. రైతుసంఘం నాయకులు జోగి శివకుమార్, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి, సిఐటియు నాయకులు బివి రమణయ్య పాల్గొన్నారు
- పుత్తూరు తహశీల్దార్ ఆఫీసు ఎదుట వంటావార్పు చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి చర్చలకు పిలిపించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. తిరుపతి ఆర్‌డిఒ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ నాయకులు మునికుమారి, విజయకుమారి, ధనమ్మ, రాధ, గంగులమ్మ పాల్గొన్నారు.
- వెంకటగిరిలో టిడిపి నాయకులు డాక్టర్ మస్తాన్ యాదవ్ మద్దతు ప్రకటించారు. తమ ప్రభుత్వం రాగానే కనీస వేతన చట్టంపై సంతకం చేస్తారన్నారు. సిఐటియు నాయకులు వడ్డేపల్లి చెంగయ్య, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి స్వరూపరాణి, మంజుల, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసన్న, వరమ్మ పాల్గొన్నారు.
- శ్రీకాళహస్తిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు వంటావార్పు చేశారు.
- సూళ్లూరుపేటలో నాయకులు కె.లక్ష్మయ్య, సిహెచ్ సుధాకర్ సంఘీభావం తెలిపారు.అంగన్‌వాడీ నాయకులు హైమావతి సంఘీభావం తెలుపుతున్న నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

తాళాలు పగలగొట్టమన్న ఉత్తుర్వులు లేవు : ఎంపిడిఒ

వెంకటగిరి : అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టమని రాతపూర్వకంగా ఉత్తర్వులు రాలేదని వెంకటగిరి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విజయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉన్నందున సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను ఓపెన్ చేసి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశించారన్నారు. కొన్ని సెంటర్లను తెరచి పిల్లలకు ఆహారం అందిస్తున్నామన్నారు.

తాళాలు పగలగొట్టిన సచివాలయ సిబ్బంది

దొరవారిసత్రం : గత వారం రోజులుగా అంగన్వాడి కేంద్ర కార్యకర్తలు, సహాయకులు నిరవధిక సమ్మెలో ఉండడంతో కేంద్రాలన్నిటికీ తాళాలు వేశారు. దీంతో ప్రీ స్కూల్ పిల్లలకు, దినసరి అందించే వైయస్సార్ సంపూర్ణ పోషణ సరఫరా ఆగిపోయింది. ప్రభుత్వానికి, యూనియన్ నాయకుల మధ్య వారి డిమాండ్లలో సయోధ్య కుదరకపోవడంతో సమ్మె కొనసాగుతూనే ఉంది. అధికారుల ప్రత్యామ్నాయ మార్గాలుగా అంగన్వాడీ కేంద్రాలు తెరవడానికి రంగంసిద్ధం చేశారు. దొరవారిసత్రం మండల పరిధిలోని ఎంపీడీవో రఘురామయ్య ఆదేశాల మేరకు ఒక్కొక్కటిగా తాళాలు తొలగిస్తున్నారు. చవట కండ్రిగ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సమక్షంలో తాళాలను తొలగించారు. కేంద్రానికి పిల్లలను పిలిపించి వారికి భోజనం సదుపాయానికి చర్యలు చేపట్టారు. అంగన్వాడీ వర్కర్లు మాత్రం తాడోపేడో తేల్చుకునే వరకు నిరవధిక సమ్మెను ఆపేది లేదనే ధోరణిలో సమ్మెను కొనసాగిస్తూనే ఉన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌కు గుండెపోటు

ప్రజాశక్తి - రేణిగుంట



అంగన్‌వాడీల సమ్మె ఎనిమిదో రోజూ కొనసాగింది. సమ్మెలో భాగంగానే నడిరోడ్డుపైనే వంటావార్పుతో వినూత్న నిరసన తెలిపారు. రేణిగుంట నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్ సరోజమ్మ (55)కు గుండెపోటు వచ్చింది. వెంటనే సిఐటియు, అంగన్‌వాడీ నాయకులు ఆమెను తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్‌చేశారు. 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె పనిచేస్తున్న అంగన్‌వాడీ సెంటర్‌ను సోమవారం సచివాలయ సిబ్బంది తాళాలు పగలగొట్టడంతో ఒత్తిడికి గురైన ఆమెకు మంగళవారం మధ్యాహ్నం గుండెల్లో తీవ్ర నొప్పి వచ్చి కుప్పకూలిపోయింది. సిఐటియు మండల కార్యదర్శి హరినాథ్ 108కు ఫోన్ చేయగా, అర్ధగంట తరువాత వస్తామని చెప్పడంతో, ఆటోలోనే ఆస్పత్రికి తరలించారు. ఎఐటియుసి నియోజకవర్గకార్యదర్శి మణి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర, బిల్డింగ్ వర్కర్స్ కార్యదర్శి చిన్న, ఆవాజ్ మండల కార్యదర్శి దిలీప్‌బాషా, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, సంఘమిత్ర మండల కార్యదర్శి లక్ష్మి, సిపిఎం నాయకులు ఓ.వెంకటరమణ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు.





ఆ 'ఏడుగురూ' తప్పుకోండి..?

వైసిపి ఎంఎల్‌ఎలకు జగన్ సూచన
రిజర్వుడు స్థానాలన్నింటిలో మార్పు
అధికారంలోకే వస్తే నామినేటెడ్ ఇస్తాం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల హడావిడి మొదలయ్యింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గెలుపు గుర్రాలపై వేట మొదలు పెట్టారు. ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏడుగురు సిట్టింగ్‌లను తప్పుకోవాలని సూచించారు. ఆ స్థానాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. త్వరలోనే ఆ ఏడుగురిని తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని బుజ్జగింపు, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ పదవులు ఇస్తామని ప్రకటించనున్నారు. సర్వేల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వారిలో తిరుపతి జిల్లాలోని గూడూరు ఎంఎల్‌ఎ వరప్రసాద్, సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ కిలివేటి సంజీవయ్యను, సత్యవేడు ఎంఎల్‌ఎ ఆదిమూలంలకు త్వరలోనే పిలుపురానుంది. ఈ మూడూ రిజర్వుడు కావడం గమనార్హం. అలాగే నగరి ఎంఎల్‌ఎ ఆర్‌కె రోజాను పిలిపించుకుని ఆమె నిమిత్తంలో ఆమె పేరును తొలగించుకుని జాబితా నుంచి పోటీ లిస్టులో ఉంచారని తెలుస్తోంది. చంద్రగిరి, తిరుపతి మాత్రం చెవిరెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డిలకు ఇప్పటికే టికెట్ ఖరారయ్యింది. శ్రీకాళహస్తి నుంచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటగిరి నుంచి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిలకు టికెట్ ఇచ్చినట్లే. అన్నమయ్య జిల్లా విషయానికి వస్తే పీలేరు ఎంఎల్‌ఎ చింతల రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎంఎల్‌ఎ ద్వారకానాథరెడ్డిలను పక్కన పెట్టే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, పూతలపట్టు ఎంఎల్‌ఎ ఎంఎస్‌బాబులను పక్కన పెట్టనున్నారని తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత ఉమ్మడి జిల్లాలో మరికొందరి పేర్లు తొలగించి కొత్తవారికి అవకాశం ఇస్తారని ప్రచారం సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులకు ధీటుగా గెలుపు గుర్రాలను పెట్టాలన్న కసరత్తును తెలంగాణా ఎన్నికల తరువాత ముమ్మరం చేశారు. పక్కన పెట్టే వారిని బుజ్జగించే బాధ్యతను రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలకు అప్పగించినట్లు తెలుస్తోంది.



తిరుమలలో మంత్రి రోజా

నగిరి సీటు నాదే : ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఈసారి ఎన్నికల్లో రోజాకు సీటు లేదని ప్రచారం చేసేంత మాత్రాన భయపడేది లేదని, నగిరిలో ఎవరికి సీటు ఇచ్చినా జగనన్న సైనికురాలుగా పనిచేస్తా' అని టూరిజం శాఖా మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. మంగళవారం ఉదయం విఐపి విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. నగరిలో తనకు సీటు ఇవ్వకపోతే అక్కడ వైసిపి తరఫున ఎవరు నిలబడతారని ప్రశ్నించారు. గడప గడపకూ తిరుగుతూ పార్టీకి పనిచేసిన వారికి కచ్చితంగా జగనన్న సీటు కేటాయిస్తారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందంజలో ఉండే ఎంఎల్‌ఎల్లో తాను ఒకరినని, తాను వైఎస్ జగన్‌కు సైనికురాలినని, ఆయన కోసం ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధమని అన్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు లేరని రోజా ఎద్దేవా చేశారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

పేదలకు విద్యను దూరం చేయొద్దు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని వినాశకరం వైపు తీసుకెళుతూ బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. విద్యార్థిలోకం వినాశకర విద్యా విధానాన్ని ముక్తకంఠంతో అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా మహాసభ వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థి ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభసభలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. విద్యారంగంలో బడ్జెట్‌ను పెంచడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వింతగా ఏ రాష్ట్రం అమలు చేయకుండానే తానున్నానంటూ నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతబడి, పేదలకు విద్య దూరం అవుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం రోజురోజుకూ కనుమరుగవుతోందన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు, సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి మాధవక్రిష్ణ కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు అక్బర్, అశోక్, హరిత, సహాయ కార్యదర్శులు హరి, తేజ, రవి,ప్రసాద్, పవన్ పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌గా బన్సల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ నియమితులయ్యారు. 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన బన్సల్ ప్రస్తుతం రంప చోడవరం సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై తిరుపతికి రానున్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు సాదర వీడ్కోలు

రేణిగుంట : తిరుపతి, తిరుమల రెండు రోజుల పర్యటన ముగించుకొని మంగళవారం సాయంత్రం రేణిగుంట రైల్వే స్టేషన్ నుండి విజయవాడ తిరుగు ప్రయాణమైన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు లభించింది. జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర రెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ భారతి, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి గవర్నర్ కు సాదర వీడ్కోలు పలికారు.


సేవా కార్యక్రమాలతో జగనన్న పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - నారాయణవనం

సేవా కార్యక్రమాలతో ముఖ్యమంత్రి జగనన్న పుట్టినరోజు వేడుకలు నిర్వహించాలని ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. గురువారం నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కేక్‌కటింగ్, మొక్కలు నాటడం, అన్నదానం, రక్తదానం చేయాలన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

తిరుపతి టౌన్ : మెటర్నిటీ హాస్పిటల్ ఆవరణలో తిరుపతి లయన్స్ క్లబ్బు అధ్యక్షులు బి.మునికష్ణ నాయుడు, లయన్స్ క్లబ్ తిరుపతి స్మార్ట్ సిటీ అధ్యక్షులు సోమయ్య సంయుక్తంగా రోగులకు వారి సహాయకులకు ఉచితంగా అల్పాహారం అందించారు. సందర్భంగా మునికష్ణ నాయుడు మాట్లాడుతూ సేవ చేయడంలో చాలా సంతప్తి ఉంటుందన్నారు. ప్రతి సోమవారం అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ తిరుపతి కార్యదర్శి ముబారక్ బాషా, రాజేంద్రప్రసాద్, మేరీ, పద్మనాభన్ ,స్మార్ట్ సిటీ క్లబ్బు కార్యదర్శి వికాస్ పాల్గొన్నారు.





శ్రీవారి ఆలయాన్ని సుగంధద్రవ్యాలతో శుద్ధిచేసిన టిటిడి ఛైర్మన్, ఈవో

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా జరిగింది. డిసెంబరు 23న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు గంటల పాటు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో వందల సంవత్సరాలుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గర్భాలయం, ఉప ఆలయాల గోడలకు ముప్పు వాటిల్లకుండా సుగంధభరితమైన పరిమళ ద్రవ్యాలతో ప్రోక్షణం చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా అష్టదళ పాదపద్మారాధన సేవ రద్దయింది. టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, అశ్వర్థనాయక్, నాగసత్యం, డా.తిప్పేస్వామి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో నందకిషోర్ పాల్గొన్నారు.

స్మార్ట్‌గా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో చేపట్టిన అభివద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని తిరుపతి స్మార్ట్ సిటి ఎం.డి అండ్ సిఈఓ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో ఎం.డి. సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన అభివద్ధి పనులు వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాత మునిసిపల్ కార్పొరేషన్ స్థలంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు తదితర నిర్మాణాలను అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్రాజెక్ట్ లో పెండింగ్ పనులు త్వరగా చేయాలని అన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, స్మార్ట్ సిటీ జి.ఎం చంద్రమౌళి, ఎంఈ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజి, ఏఏఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

నా బిడ్డకు ప్రాణ బిక్ష పెట్టండి

ఓ పేద తండ్రి వేడుకోలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఆస్పత్రిలో బిడ్డతో తల్లి

'అయ్యా...! మేము కడు నిరుపేదలం. కూలీ చేస్తేనే కుండకాలాలి. లేదంటే ఎండగాలాలి. అసలే పేదరికంతో అల్లాడుతున్న మా బాబుకు అనారోగ్యం శాపంగా మారింది. ఆ వ్యాధి నయం కావాలంటే రూ.12లక్షలు కావాలని వైద్యులు చెబుతున్నారు. అంత సొమ్ము ఖర్చు చేసే స్థోమత మాకు లేదు. అందుకే దాతలు మానవత్వంతో స్పందించి నా బిడ్డకు ప్రాణ బిక్ష పెట్టండి" అని ఓ నిరుపేద తండ్రి వేడుకుంటున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కాసరం దళితవాడకు చెందిన ప్రభాకర్, రమాదేవి దంపతులది చాలా నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు దీక్షిత (5), భానుప్రకాశ్ (3) అనే ఇద్దరు సంతానం. భానుప్రకాష్‌కు తెల్ల రక్త కణాలు తగ్గిపోయినందున మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ప్రభాకర్ తన స్థోమతకు మించి ఖర్చు చేశారు. ఆ బాలునికి ఆరోగ్యం కుదుట పడాలంటే ఆరు మాసాలు ఆస్పత్రిలోనే ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ఆ తరువాత మూడేళ్ల పాటు ఆ బాలునికి మందులు వాడాల్సి ఉంటుంది. ప్రస్తుతం భానుప్రకాశ్ వైద్యం కోసం రూ.12లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారు. అంత సొమ్ము చెల్లించే స్థితిలో ప్రభాకర్ దంపతులు లేరు. అందుకే వారు దాతల సాయం కోరుతున్నారు. దయగల వారు 6302546845 లేదా, 9550093821 ఫోన్ నంబర్లలో సంప్రదించి సాయం చేసి తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని ప్రభాకర్ దంపతులు వేడుకుంటున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాల ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులు, పి.ఈ.టి లతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న ఈ క్రీడోత్సావాల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని, ఈ మేరకు ఆయా సచివాలయం పరిధిలో చేయాల్సిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. కాంపిటీటివ్ కేటగిరీలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయని అన్నారు.



టీటీడీ హెల్త్ టెండర్లలో కార్మికులకు అన్యాయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



టీటీడీలో పారిశుధ్య పనులు నిర్వహణకై పిలిచిన టెండర్లలో ప్రస్తుతం పనిచేస్తున్న మూడువేల మంది కార్మికులను తొలగించి, 45 సంవత్సరాలలోపు ఉన్న కొత్త వారిని తీసుకోవడం కోసం కొత్త నిబంధనలు పెట్టడం సరైంది కాదని సిఐటియు నాయకులు టి.సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పని చేస్తున్న మహిళా కార్మికులలో45 సంవత్సరాల లోపు ఉన్న 25 శాతం మంది మహిళా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, మిగతా వారిని తొలగించాలని పెట్టిన నిబంధన కార్మికులు పొట్ట కొట్టే విధంగా ఉందని, టిటిడి యాజమాన్యానికి మంచిది కాదని అన్నారు. కొత్త నిబంధనలకు సిఐటియు వ్యతిరేకమని అన్నారు. తిరుమల హెల్త్ ఆఫీసర్ బహిరంగంగానే 45 సంవత్సరాల పైబడిన వారిని ఏ ఒక్కరినీ తీసుకోబోమని చెప్పారని అన్నారు. కొత్త నిబంధనల ప్రకారం 3 వేల మందిని తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని పెట్టుకుంటారని తెలిపారు. కొత్త టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు కొత్తగా పెట్టిన నిబంధనల ప్రకారమే కార్మికులను తీసుకుంటారని, ఈ విషయాన్ని కార్మికులు గ్రహించాలని పేర్కొన్నారు. కార్మికులు చేపట్టే ఆందోళనకు ఈవో, హెల్త్ ఆఫీసర్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కొత్తగా పిలిచిన టెండర్లను రద్దుచేసి, గతంలో ఉన్న టెండర్ల విధానాన్ని అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని టిటిడి యాజమాన్యాన్ని కోరారు. పనిచేస్తున్న కార్మికులను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏ .రాధాకష్ణ, తంజావూరు మురళి, వి ఎస్ మన్యం పాల్గొన్నారు.

అగర్వాల్ ప్రాథమిక కంటి సంరక్షణ కేంద్రం ప్రారంభం

తిరుపతి సిటీ : దేశంలో అతి పెద్ద కంటి సంరక్షణ కేంద్రాల్లోఒకటైన డాక్టర్ అగర్వాల్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్ తమ ప్రాథమిక కంటి సంరక్షణ కేంద్రాన్ని రాయచోటి లో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా అగర్వాల్స్ ఐ క్లినిక్ ఒక ఆధునిక కంటి సంరక్షణ సదుపాయం అన్నారు. ఇందులో నిపుణులైన వైద్యులు సంపూర్ణ కంటి ఆరోగ్య చెక్-అప్స్ అందిస్తారు. ఈ కేంద్రములో రిఫ్రాక్షన్ డిగ్రీ, కంటి ఒత్తిడి, విజువల్ తీక్షణతలను ఖచ్చితంగా అంచనా వేసేందుకు, కంటి శుక్లాలను ప్రారంభదశలోనే కనుగొనుటకు అత్యాధునిక ఉపకరణాలు ఉన్నాయన్నారు. డాక్టర్స్ అగర్వాల్స్ ఐ క్లినిక్ లో "ఏదైనా లెన్స్ కొనండి ఒక ఫ్రేమ్ ఉచితంగా పొందండి" అనే ప్రారంభ ఆఫర్ తోపాటు ఉచిత శుక్లాల చెక్-అప్స్ కూడా అందిస్తోందన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోసుమంత్ రెడ్డి, డాక్టర్ గోపికష్ణ పాల్గొన్నారు.



రోడ్లు, డ్రైనేజ్ పనులకు భూమి పూజ



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ 16వ వార్డు లోని 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా సబ్ రిజిస్ట్రారు కార్యాలయం, జ్యోతి స్కూల్ సమీపం లో రూ.8.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు అభివృద్ధి పనులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్ కె రోజా మంగళవారం భూమి పూజ చేశారు. పుత్తూరు మున్సిపల్టీ వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు మంత్రికి ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్టీ ఛైర్మన్ ఎ హరి, వైస్ ఛైర్మన్లు, డి జయప్రకాష్, కౌన్సిలర్లు వనిత కార్తీక్, భానుమతి, మున్సిపల్ కమిషనర్ కేవల్ రెడ్డి, అధికారులు, ఆలయ ఛైర్మన్ కె రమేష్, మహేష్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్లు, బోర్డు డైరెక్టర్లు మున్సిపల్ సిబ్బందిలో కన్వీనర్ పార్టీ కన్వీనర్ వైసిపి కార్యకర్తలు, నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-బియన్‌కండ్రిగ: సచివాలయం ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ పై మహిళల అవగాహన సదస్సులో ఎంపీడీవో సాయి లహరి, వైసిపి మండల అధ్యక్షులు విద్యాసాగర్‌రెడ్డి, అగ్రికల్చర్ అధికారి భారతి మాట్లాడుతూ చిన్న స్థాయి నుండి పై స్థాయి వరకు ఎదిగిన ప్రధాని తెలుసుకొని నేడు ప్రజల అవసరాల కోసం తగిన విధంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారు వివిధ అభివృద్ధి పథకాలు తీసుకువచ్చి అన్ని రంగాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వివిధ కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ సెక్రెటరీ ఇందిర, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ భారతి, హెల్త్ ఆఫీసర్ దివాకర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎంఎల్‌హెచ్ పి ప్రియాంక వారి సిబ్బంది, ఎఎన్ఎం రత్నమ్మ, ఆశా వర్కర్లు సచివాలయ సిబ్బంది, గ్రామప్రజలు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గణిత మేధావులు

గణిత అష్టావధానం విజయవంతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గణిత అష్టావధానం విజయవంతమైంది. ఈ నెల 22వ తేదీ శ్రీనివాస రామానుజం జయంతి, జాతీయ గణితశాస్త్ర దినోత్సవం సందర్భంగా కళాశాలలో గణిత అష్టావధానం నిర్వహించారు. చిత్తూరు పట్టణానికి చెందిన హెచ్ అరుణ రాష్ట్ర ప్రసాద్ అవధానిగా వ్యవహరించారు. ఈ అవధానంలో 8 మంది విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరించారు. నిషిద్ధ సంఖ్య, క్యాలెండర్, క్యూబ్ వంటి గణిత సమస్యలను అవధాని కొన్ని సెకన్లలో సమాధానం చెప్పి విద్యార్థులను ఆశ్చర్య పరిచారు. మరికొన్ని గణితశాస్త్ర చిక్కు ముడులను చిటికెలో పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జి.శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైసిపి నాయకులు

వైసీపీ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పంగూరు గ్రామ సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాని ఆవిష్కరించారు. తరువాత ప్రజలకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేశారో వివరించారు. తరువాత ఇంటింటికి వెళ్లి వారు పొందిన లబ్ది వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి ఇంచార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, మండల అధ్యక్షులు కునాటి రమణయ్య యాదవ్, పంగూరు సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న వైసిపి నాయకులు పోలయ్య, పాగాలి సర్పంచ్ గాది రాజేశ్వరి , కుమార్ నాయుడు, బొర్రా నారాయణ, అంజిమేడి శివ, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



టిడిపి కార్యకర్త భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న బొజ్జల బృందమ్మ

టిడిపి కార్యకర్త కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామంలో టిడిపి కార్యకర్త కాళహస్తి మాధవరెడ్డి అనారోగ్యంతో మరణించాడు. శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ మంగళవారం మాధవరెడ్డి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులు అర్పించిన వారిలో టిడిపి నాయకులు పేరం ధనంజయ నాయుడు, కందాటి శివశంకర్ రెడ్డి, ముని రంగారెడ్డి, చెవిరెడ్డి శివాజీ రెడ్డి, ధర్మారెడ్డి, రవి రెడ్డి, దొరస్వామి రెడ్డి, బాలాజీ రెడ్డప్ప ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ



స్థానికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసు కుంటా మని డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. గూడూరు పట్టణ పరిధిలోని చవటపాళెం ప్రాంతంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పలు ఇళ్లలో ఉంటున్న వారి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని వాహనాలను వారు సీజ్ చేశారు. యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి రెండు నెలలకు ఒకసారి వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నామన్నారు. కొత్త వ్యక్తుల సమాచారం, పాత నిందితుల కదలికలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఈ తనిఖీల్లో సీఐలు దశరధరామారావు, హజరత్ బాబు, వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐలు మనోజ్ కుమార్, అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయండి..

సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేత



ప్రజాశక్తి-వెంకటగిరి: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని లేదంటే నిరవధిక సమ్మె చేపడుతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు వెంకటగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌కి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తూ ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు చదువులోనూ, విధుల్లోనూ తేడా లేదని ఇద్దరూ ఒకరేనని చెప్పిన మేరకు ఔట్సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ ఆప్కాస్ లో ఉద్యోగులుగా నమోదు చేసిన మేరకు పర్మినెంటు ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగా జీతభత్యాలు, లీవ్‌లు, ఎన్ క్యాష్ మెంట్, గ్రాట్యుటీ పెన్షన్, తదితర పథకాలు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు రిస్కు, హెల్త్ అలవెన్సు చెల్లించాలని అన్నారు. జీవో ఆర్ టి నెంబర్ 30ని సవరించి కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జీతాలు చెల్లించాలని కోరారు. చట్టబద్దమైన సెలవులు రక్షణ, భద్రత సౌకర్యాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని డిసెంబర్ 21వ తేదీ లోపల మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే ఆ తర్వాత ఏ రోజు నుండైనా నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు మంజులమ్మ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు టి సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోసం 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలుగా విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోని నేపథ్యంలో అనివార్యమై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెకు పట్టారని తెలిపారు. సమ్మె ప్రారంభమయ్యే 20వ తేదీ బుధవారం నాడు తిరుపతి నగరంలో జిల్లాలోని ఉద్యోగులతో నిరసన చేపట్టనున్నట్టు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. బుధవారం కొర్లగుంట పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరసన చేపట్టనున్నట్లు జిల్లా ప్రజలు సమగ్ర శిక్షా ఉద్యోగులకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. జిల్లాలోని సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తిరుపతిలో జరుగుతున్న కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎస్‌టియు మద్దతు: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 20వతేదీ నుండి చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఎస్‌టియు తిరుపతి నగరశాఖ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నుండి ఎస్‌టియు నాయకులు వినతి పత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం తిరుపతి జిల్లా ఆర్థిక కార్యదర్శి బి మునికృష్ణ నాయుడు, తిరుపతి ఎస్‌టియు నగర శాఖ అధ్యక్షులు పి .మురళీకృష్ణ , ప్రధాన కార్యదర్శి బి .రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు

పజాశక్తి -దొరవారిసత్రం : ఎన్నో ఏళ్లుగా భద్రత లేని ఉద్యోగాల్లో కొనసాగుతున్న తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం దొరవారిసత్రం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట మండల పరిధిలోని సిఎంఆర్‌టి లు, ఏ ఆర్‌టి, డిఈఓ, మెసెంజర్‌లు డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పని సమాన వేతనం చెల్లించాలని, ప్రతి నెల ఒకటవ తేదీ జీతాలు జమ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ క్రమబద్ధీకరించాలని, ఐఎంటిఏస్ కింద జీతాలు అందించాలని, జిపిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్‌టి లు ఎం సుబ్రహ్మణ్యం, సిహెచ్ బత్తయ్య, శ్రీనివాసులు, చంద్రయ్య, కే సుబ్రహ్మణ్యం, వెంకట కృష్ణయ్య ఖాదర్ బాషా, సురేఖ, మెసెంజర్ వెంకటేశ్వర్లు ఐఇఆర్టి టీచర్లు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : తమకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గూడూరు పట్టణంలోని మండల విద్య వనరుల కేంద్రం వద్ద ఫ్ల కార్డులతో మంగళవారం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ న్యాయ పరమైన డిమాండ్ల కోసం ఈ నెల 20న చేపట్టే సమ్మెకు ఉపాధ్యాయ సంఘాలు అన్ని మద్దతు తెలపాలని కోరారు.



గూడూరులో



కో పైలెట్ సురేష్‌బాబు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కో పైలెట్ మృతికి నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నింద్ర మండలం కొప్పేడు దళితవాడ కు చెందిన రైల్వే శాఖలో కో - పైలెట్ గా సురేష్ బాబు(36) సోమవారం విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన భౌతికకాయానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి మంగళవారం నివాళి అర్పించారు. సురేష్ బాబు రైల్వే శాఖలో కో - పైలెట్‌గా పని చేసేవారు. విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు గూడూరులో సోమవారం మరణించారు. సమాచారం అందుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శ్రీశైలం దేవస్థానం ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి తో కలసి మృతుని స్వగృహానికి వెళ్లి సురేష్ బాబు భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం మృతుని తండ్రి చెంగయ్య కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదు కుంటుందని భరోసా కల్పించారు.



వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగిస్తున్న ప్రముఖులు

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం-ఉపాధి అవకాశాలు" అనే అంశంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మేనేజరు మోహన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లను అలవరచుకోవడం ద్వారా ఉత్తమ ప్రయోజకులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు జి. శ్రీనివాసులు రెడ్డి, ప్రముఖ.వ్యక్తిత్వ వికాస నిపుణులు నివేదితారెడ్డి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధ్యక్షురాలు ఎ దేవకి, అధ్యాపకులు లక్ష్మీబాయి, డాక్టరు తిరుమలయ్య, జ్యోతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న నారాయణ కళాశాల విద్యార్థులు

నారాయణ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గూడూరు సెంట్రల్ ఫర్ ఎక్స్టెన్షన్ ఆక్టివిటీస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో మంగళ వారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రక్తదానం చేయటం వల్ల ఆపదలో ఉన్నవారిని కాపాడుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎన్.ఎస్.ఎస్ తరపున నిర్వహించి స్వచ్ఛంద రక్తం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడుతున్నందుకు తమ కళాశాల విద్యార్థులను అభినందించారు. ఇదే విధంగా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం 120 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విశ్వక్సేన రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కోటేశ్వర్ రావు, ఏఒ కొండారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నగదు సాయం పంపిణీ

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలం మేనకూరు సచివాలయ పరిధిలో వరద బాధితులకు ప్రభుత్వం అందించిన నగదు సాయం 685 బాధిత కుటుంబాలకు రూ.14,61,000ను నాయుడుపేట జడ్పిటిసి కట్టా జ్యోతి రెడ్డి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ వరద బాధితుల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తక్షణమే ప్రజలకు అవసర మైన నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారని తెలిపారు. ప్రభుత్వం వరద బాధితులను ఆదుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ సాయం పేద ప్రజలకు ఊరట నిస్తుందన్నారు. తుపాన్ సమయం లో అన్ని విధాలుగా సేవలు అందించిన అన్ని ప్రభుత్వ రంగ ఉద్యోగు లకు ఆయన అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మేనకూరు సర్పంచ్ సిహెచ్ సురేష్, వీఆర్వో శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి గోవర్ధన్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఓ విజయ్ కృష్ణ, కె ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్స్ మేనేజర్ షేక్ రఫీ, అకౌంటెంట్ నరేంద్ర, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరద బాధితులకు నగదు సాయం అందిస్తున్న జడ్‌పిటిసి జ్యోతిరెడ్డి

ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడు గ్రామపంచాయతీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద బాధితులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మండల ఇన్చార్జి గున్నేరు కిషోర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య నేతృత్వంలో బియ్యం ,కందిపప్పు, ఆయిల్ అంద చేశారు. మంగళవారం వరద బాధితులకు 140 కుటుంబాలకు రెండు లక్షల 84 వేల రూపాయలు అందించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అధ్యక్షతన మండల ఇన్చార్జి గున్నేరు కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వరద బాధితులకు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు బాలాజీ, ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ, డీలర్ రవి పాల్గొన్నారు.



ఏర్పేడులో వరద బాధితులకు నగదు సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

వైసీపీలో యువత చేరిక

ప్రజాశక్తి,-శ్రీకాళహస్తి: పట్టణంలోని16వ వార్డుకు చెందిన వంద మంది యువత మంగళవారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరడం హర్షణీయమన్నారు. అంజూరు తారక శ్రీనివాసులు, ఉన్నం వాసు నాయుడు, భాస్కర్, ఫజల్, జిమ్ కరిముల్లా, కోవి చంద్రయ్య నాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైసీపీలో చేరుతున్న యువకులు

పారాచ్యూట్ అడ్వాన్స్డ్ హెయిర్ ఆయిల్ 'సంపూర్ణ' విడుదల

ప్రజాశక్తి -తిరుపతి: ప్రముఖ పారా షూట్ అడ్వాన్స్ కంపెనీ సంపూర్ణ పారాచ్యూట్ పేరుతో కొత్త హెయిర్ ఆయిల్ ని మార్కెట్లోకి విడుదల చేసినట్లు ఆ సంస్థ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్థి వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కొత్త హెయిర్ ఆయిల్ సంపూర్ణ కొబ్బరి మంచిదనంతో పాటు ఐదు ప్రత్యేక మూలికలు - ఉసిరి, మందార, కలబంద, మెంతి, కరివేపాకు కలయికతో మందపాటి, పొడవాటి నల్లటి జుట్టును అందిస్తుందన్నారు. పారాచూట్ అడ్వాన్స్ డ్ సంపూర్ణ పరిచయం మా హెయిర్ కేర్ పోర్ట్ ఫోలియోలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో, జుట్టు అందంగా ఆరోగ్యంగా ఉండటానికి 'ఎక్స్ ట్రా కేర్' అవసరం. అలాంటి 'ఎక్స్ ట్రా కేర్'ను కొబ్బరి పోషక శక్తిని ఐదు అసాధారణమైన మూలికలు కలపడం ద్వారా 'పారాచూట్ అడ్వాన్స్ డ్ సంపూర్ణ అందిస్తుందన్నారు. పారాచూట్ అడ్వాన్స్‌డ్ సంపూర్ణ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ రిటైల్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉందని తెలిపారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



టిడిపి వ్యాఖ్యలు సరికాదు : షేక్ ఇమామ్ సాహెబ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ముస్లింలు రాజకీయంగా ఎదగడం ఓర్వలేకే టిడిపి ముఖ్య నాయకులు తిరుపతి ముస్లిం సోదరులను తాలిబాన్లతో పోల్చడం సరికాదని నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు షేక్ ఇమామ్ సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో తిరుపతి నగరంలోని రుయా ఆసుపత్రిలో కరోనా సోకి తనువు చాలించిన వేలాది మృతదేహాలకు బాధ్యత గల పౌరుడిగా సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారాలు చేసిన ఘనత తిరుపతి ముస్లింలది అన్నారు. అప్పుడు టిడిపి నాయకులు మానవతా దృక్పథంతో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మస్లింలు భూమన కుటుంబం ఆధ్వర్యంలో రాజకీయంగా ఎదగడం టిడిపికి చెందిన కొందరు నాయకులు జీర్ణించుకోలేక తనను తాలిబాన్లతో పోల్చుతున్నారని ఇది తగదన్నారు. టిడిపి అధికారిక సామాజిక మాధ్యమంలో తిరుపతి ముస్లింలను తాలిబాన్లతో పోల్చుతూ పోస్ట్ చేశారని దీనిపై చంద్రబాబుపై ఎందుకు కేసు నమోదు చేయకూడదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆనం వెంకటరమణారెడ్డి భూమన కుటుంబంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై స్పందించిన దానికి కో ఆప్షన్ సభ్యత్వం రద్దు చేయాలని, సుమోటోగా కేసు నమోదు చేయాలని టిడిపికి సంబంధించిన ఎల్లో మీడియాలో రాతలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారన్నారు. గతంలోనూ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నిరాహార ఆరోపణలు చేస్తూ ఎస్పీకి ఫిర్యాదు చేశారన్నారు. ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే భూమన కుటుంబంపై బురదజల్లే కార్యక్రమానికి టిడిపి తిరుపతి నాయకత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధిని చూపిన భూమనకే ప్రజలు మద్దతు తెలుపుతారని స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర మైనారిటీ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరేంద్రనాథ్, ఏపీ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ ఫరీద్, మోహన్ రాజ్, సలీం, ఖా, నవాబ్, గంగా మోహన్, గౌస్ బాషా, వెంకటరమణ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం కేబిఆర్ పురం పంచాయతీలో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంను టిడిపి నాయకులు మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తమ సంక్షేమ పథకాలను ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య టిడిపి ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు డి రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎ బాలాజీ, మాజీ అధ్యక్షులు మోహన్ రాజు, మహేష్, డి వెంకటేష్, మాజీ సర్పంచ్ డి సుబ్రమణ్యం, మునివేలు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



'ఆడుదాం ఆంధ్ర' క్రీడల కిట్లు అందిస్తున్న ఎంపిపి బాల యుగంధర్‌రెడ్డి

'ఆడుదాం ఆంధ్ర' కిట్ల అందజేత

ప్రజాశక్తి -చిన్నగొట్టిగల్లు: ఈ నెల 23 వ తేదీ నుండి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర' మండల జిల్లా రాష్ట్ర స్థాయి క్రీడల సందర్భంగా క్రికెట్ బ్యాడ్మింటన్ తదితర ఆటలకు సంబంధించిన కిట్లను ఎంపిపి బాలం యుగంధర్ రెడ్డి, డిసిఎమ్మెస్ ఛైర్మన్ సామకోటి సహదేవ రెడ్డి, ఎంపిడిఓ దేవేందర్ బాబు, పంచాయతీ సెక్రటరీ లకు అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కొండారెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, దేవ ప్రసాద్, సర్పంచ్ లు మునిరాం, సీతాపతి, మునిరెడ్డి పాల్గొన్నారు.



యువగళం సభకు తరలి వెళుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

యువగళం సభకు వెయ్యి మంది తరలింపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం ముగింపు సభకు మంగళవారం శ్రీకాళహస్తి నుంచి వెయ్యి మంది టీడీపీ కార్యకర్తలు యాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయనగరానికి బయలుదేరి వెళ్లారు. బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితా రెడ్డి జెండా ఊపి కార్యకర్తలకు వీడ్కోలు పలికారు.

శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు ప్రముఖ వాణిజ్య బ్యాంక్ కెనరా బ్యాంక్ అంబులెన్స్ ను మంగళవారం ఉచితంగా వితరణ చేసింది. శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి బి చంద్రశేఖర్ ప్రస్తుతం హైదరాబాద్ సర్కిల్ కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ గా పని చేస్తున్నారు. తన సహ విద్యార్థి అయిన ప్రస్తుత శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి వినతి మేరకు కెనరా బ్యాంక్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా రూ. 10 లక్షల విలువైన అధునాతన ఆంబులెన్స్‌ను మంగళవారం కళాశాల అసోసియేట్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కళాశాల పూర్వ విద్యార్థి జి. చంద్రశేఖర్ విద్యార్థులతో, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. తాను చదువుకున్న కళాశాలకు తన వంతు సాయంగా ఆంబులెన్సును అందించడం ఎంతో సంతోషంగా ఉందని భవిష్యత్తులో తన వంతు సహకారాన్ని అందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సహాయ జనరల్ మేనేజర్ నాగరాజు రావు, విద్యానగర్ బ్రాంచ్ మేనేజర్ సుధీర, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు అంబులెన్స్‌ను వితరణ చేస్తున్న దృశ్యం

ఏపీఎం రీ జాయినింగ్ పై విచారణ చేపట్టాలి

ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా డక్కిలి మండల ఏపీఎం ఎం పోలమ్మ అవినీతి ఆరోపణలపై ఈనెల 11న నెల్లూరు ప్రాజెక్టు వారికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, సరెండర్ ఉత్తర్వులు ఇచ్చిన తిరుపతి డిఆర్‌డిఎ పీడీ వెంటనే పోలమ్మకు అదే మండలంలో పోస్టింగ్ ఇచ్చారని, పోలమ్మ రీ జాయినింగ్ పై కలెక్టర్ విచారణ చేపట్టాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మునెయ్య మాట్లాడుతూ పోలమ్మ విధి నిర్వహణలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని, దీనిపై సాక్షాత్తు జిల్లా స్థాయి డిఎంజి బృందం పరిశీలించి తుది నివేదిక ఇవ్వడంతోనే పోలమ్మను నెల్లూరు ప్రాజెక్టుకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే తొలగించిన మండలానికి పోలమ్మకు ఆగమేఘాలపై ఉత్తర్వులు ఎలా ఇచ్చారో చెప్పాలని డిఆర్డిఏ పీడిని ప్రశ్నించారు. పోలమ్మ ద్వారా నిరుపేద మహిళలు చాలామంది ఇబ్బందులకు గురయ్యారని, విచారణ జరపని పక్షంలో బాధిత మహిళలతో కలిసి సెర్ప్, డిఆర్డిఏ రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



ఎపిఎం అవినీతిపై మాట్లాడుతున్న ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మునెయ్య

మహిళా వర్సిటీలో శాస్త్రవేత్తల సహకార ఇంటరాక్టివ్ సమావేశం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో సహకార ఇంటరాక్టివ్ మీట్ హైదరాబాద్, ఎఎస్పిఐఆర్ఈ, డైరెక్టర్ ఆచార్య రెడ్డన్న, డాక్టర్ చెల్లు ఎస్. చెట్టి, రీజెంట్స్ విశిష్ట ప్రొఫెసర్ ఆఫ్ సవన్నా స్టేట్ యూనివర్సిటీ, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ భాస్కర్, ప్రొ. డి సి రెడ్డి, ఆచార్య కృపానిధి, డబ్ల్యూబిఐఎఫ్ లో నిర్వహించారు. ఈ సెషన్‌కు అధ్యక్షత వహించిన వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి భారతి డిబిటి ప్రాయోజిత మహిళా బయోటెక్ ఇంక్యుబేషన్ సదుపాయం, డిఎస్‌టి ప్రాయోజిత టిబిఐ, డిఎస్ఐఆర్ ప్రాయోజిత టిడిసిఐసి, క్యాంపస్‌లోని ఇతర కేంద్రాల వంటి ఆవిష్కరణ కేంద్రాల ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఒక గమనికను రూపొందించారు. మహిళా బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీలో ఏర్పాటు చేసిన అధునాతన మౌలిక సదుపాయాలను అభినందిస్తూ, ప్రొఫెసర్ రెడ్డన్న డాక్టరు సిఎస్ చెట్టి ఈ ప్రాంతంలో ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి తిరుపతి కోహోర్ట్‌ను స్థాపించడానికి వారి మార్గదర్శకత్వం, మద్దతుకు హామీ ఇచ్చారు. ఆచార్య కళారాణి తన ప్రదర్శన ద్వారా స్టార్టప్‌లు అభివృద్ధి చేసిన వినూత్న ఉత్పత్తులను ముందుకు తెచ్చారు. డబ్ల్యూబిఐఎఫ్ స్టాఫ్, డాక్టరు శిల్పా నయుని, సైంటిఫిక్, పరిశోధకులు పాల్గొన్నారు.



సహకార ఇంటరాక్టివ్ సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు